సాక్షి
శ్రీకాకుళం
శుక్రవారం । 21 । జూలై । 2023



ఇంటి దొంగలు

ఆదిత్యాలయంలో ఇంటి దొంగలున్నారు. గోప్యతను బయటపెడుతున్నారు.

- 8లో




ప్రతి సెంటు భూమికి సాగునీరు

నాగావళి నీరు విడుదలైంది. శివారుకు కూడా అందనుంది.

- 8లో

నీలమ్మతల్లికి ప్రత్యేక పూజలు



శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని పెద్దబరాటంవీధి, గైనేటి వీధిలో వెలసిన శ్రీనీలమ్మతల్లి అమ్మవారికి గురువారం క్షీరాభిషేకం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు పెంట కిరణ్‌శర్మ నేతృత్వంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు.

న్యూస్‌రీల్

టీడీపీలో ఫిర్యాదుల పర్వం

గార: గారలో టీడీపీ ఫిర్యాదుల పర్వం కొనసాగుతోంది. మండల కేంద్రంలో బుధవారం గొండు శంకర్ వర్గీయులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ చించేసిన ఘటన తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేయడం, దీన్ని జీర్ణించుకోలేని కొందరు వ్యక్తులు సోషల్‌మీడియాలో దుర్భాషలు ఆడుతున్నారని గొండు శంకర్ వర్గీయులు గురువారం మళ్లీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే కథ అంతటితో ముగిసిపోలేదు. గొండు లక్ష్మీదేవికి చెందిన జల్లు రాజీవ్, వమరవల్లి చిన్న, పాట్నూరు కృష్ణమూర్తి తదితరులు వెళ్లి మరో ఫిర్యాదు చేశారు. ఫ్లెక్సీ వేసిన ఫ్రేమ్ తనదేనని, ఆ ఫ్రేమ్‌కు ఫ్లెక్సీ వేయవద్దని చెప్పినా వేయడం వల్లనే చించేశానని జల్లు రాజీవ్ పోలీసులకు తెలిపారు. అయితే తమపై ఫోన్‌లో, వాట్సాప్‌లో దుర్భాషలు ఆడుతున్నారంటూ గొండు లక్ష్మీదేవి వర్గీయులు ఫిర్యాదు చేశారు. రెండు వర్గాల ఫిర్యాదులను స్వీకరించిన ఎస్ఐ ఎస్.కామేశ్వరరావు ఫ్లెక్సీల ఏర్పాటుపై ఎవ్వరి అనుమతి తీసుకున్నారు, నియమ నిబంధనలు ఏమైనా పాటిస్తున్నారా అనే అంశంపై ముందు దర్యాప్తు చేస్తామని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే మాత్రం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉచిత రెసిడెన్షియల్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నరసన్నపేట: సివిల్ సర్వీసెస్, గ్రూపు-1, గ్రూపు-2 పరీక్షలకు ఉచిత రెసిడెన్షియల్ కోచింగ్ కోసం ఆసక్తి గల వారి నుంచి జిల్లాలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సోషల్ వెల్‌ఫేర్ డీడీ విశ్వమోహనరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్సీ,ఎస్టీలతో పాటు ఇతర కమ్యూనిటీలకు చెందిన నిరుద్యోగ గ్రాడ్యుయేట్లందరికీ ఏపీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. యూపీఎస్సీ కోసం విశాఖలో, ఏపీపీఎస్సీ గ్రూప్ వన్ కోచింగ్ విజయవాడలో, ఏపీపీఎస్సీ గ్రూపు టూ కోచింగ్ తిరుపతిలో ఇస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తుదారుల కుటుంబ వార్షిక ఆదాయం రూ. 6 లక్షలు దాట కూడదని తెలిపారు. ఆసక్తి గల వారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయాల్సి ఉంటుందన్నారు. ఆగస్టు 5వ తేదీలోగా దరఖాస్తులు చేరాలన్నారు.

జీఎస్టీ ఎగవేతదారులపై చర్యలు

శ్రీకాకుళం క్రైమ్ : జీఎస్టీ ఎగవేసే వ్యాపారులపై చర్యలు తప్పవని శ్రీకాకుళం ప్రాంతీయ నిఘా, అమలు విభాగం అధికారి (ఎస్పీ) ఎ.సురేష్ బాబు అన్నారు. గురువారం శ్రీకాకుళం నగర పరిధిలోని ఆర్టీసీ కాంప్లెక్సు నుంచి బలగ కూడలి వరకు పలు ట్రావెల్ ఏజెన్సీల్లో విజిలెన్సు, జీఎస్టీ అధికారులు గురువారం తనిఖీలు చేపట్టారు. సక్రమంగా బిల్లింగ్ లేని సరుకులను గుర్తించి రూ. 27 వేల అపరాధ రుసుం విధించారు. దాడుల్లో విజిలెన్స్ సీఐ సింహాచలం, ఏసీటీఓ కామరాజు, ఎస్ఐలు అశోక్, రామారావు, జీఎస్టీ అధికారులు పాల్గొన్నారు.



మహాత్మా గాంధీకి నైవేద్యాలు తీసుకువెళ్తున్న మహిళలు

ఓ మహాత్మా.. ఓ మహర్షి

స్వాతంత్య్ర సంబరాలకు ఇంకా సమయం ఉంది. మహాత్ముని జయంతికి ఇంకా ఎక్కువ కాలమే ఉంది. కానీ ఆ ఊరిలో అప్పుడే బాపూజీకి పూజలు మొదలైపోయాయి. ఇప్పుడే కాదు స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి ఆ ఊరు గాంధీ మహాత్ముడిని ఊరి దేవరగా కొలుస్తోంది. కాశీబుగ్గలోని కేదారిపురంలో జరిగే ప్రత్యేక వేడుక ఇది. గ్రామస్తుల కథనం ప్రకారం.. 1947లో స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి ఊరిలో ఉభాలు వేసే ముందు గ్రామంలో గాంధమ్మ సంబరం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడు కూడా సంప్రదాయాన్ని కొనసాగించారు. కార్యక్రమంలో ముందుగా రామాలయం ముందు ఉన్న మహాత్ముని విగ్రహం ఎదురుగా ఆయన చిత్రపటం పెట్టి పూలతో అలంకరించి పసుపు కుంకుమలతో అలంకరించి పూజలు చేశారు. అనంతరం గ్రామ పొలిమేరల్లో ఉన్న ఎర్రమ్మ, గాంధమ్మ, భూలోకమ్మ తల్లితో పాటుగా గ్రామం చుట్టూ ఉన్న అమ్మవారి మందిరాలకు వెళ్లి పూజించారు. సుమారు 370 ఇళ్లతో 1200 లకుపైగా జనాభా ఉన్న గ్రామంలో ఇంటికో ముగ్రాట, వేపకొమ్మలు మేళ తాళాలతో గ్రామంలో అన్ని వీధుల్లో ఊరేగించారు. ఈ పూజల అనంతరం పొలం పనుల్లో నిమగ్నమవుతారు.

– కాశీబుగ్గ




మహాత్మునికి ప్రత్యేక పూజలు



పూజలకు సిద్ధం చేసిన మహాత్మా గాంధీ చిత్రపటం

అమ్మో.. డెంగీ



- పెరుగుతున్న డెంగీ కేసులు
- అప్రమత్తమవుతున్న పంచాయతీ, వైద్యారోగ్య శాఖాధికారులు
- ఇప్పటికే 1702 నమూనాల సేకరణ
- 18 వరకు కేసుల నమోదు
- ప్రైవేటు ఆస్పత్రుల్లో 50కి పైగా కేసులున్నట్లుగా సమాచారం

అరసవల్లి: సిక్కోలులో ఫీవర్..షివర్ మొదలైంది. రాకరాక కురిసిన వానలు వ్యాధులను వెంటేసుకుని వస్తున్నాయి. ఎక్కడికక్కడ ప్రస్తుతం నీటి నిల్వలు పేరుకుపోతుండడంతో దోమలు విపరీతంగా విజృంభిస్తాయి. ఏ మాత్రం అలసత్వం చూపినా డెంగీ జ్వరం వచ్చే ప్రమాదం ఉందని వైద్యశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతానికి అధికారిక లెక్కల ప్రకారం చూస్తే డెంగీ కేసుల సంఖ్య తక్కువగానే ఉన్నప్పటికీ ప్రైవేటు ఆస్పత్రుల్లో కాస్తంత ఎక్కువగానే కేసులు నమోదైనట్లు సమాచారం. దీనికి తోడు ప్లేట్‌లెట్ బూచితో ప్రైవేటు ఆస్పత్రులు డెంగీ భయాన్ని మరింత పెంచుతున్నట్లు భోగట్టా. దీనిపై అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

ముమ్మరంగా ఫీవర్ సర్వే

జిల్లాలో సచివాలయాల వారీగా ఫీవర్ సర్వే కార్యక్రమాన్ని ఈ నెల 12 నుంచి ప్రారంభించారు. అయితే వలంటీర్ల సమక్షంలో ఆశ వర్కర్లు, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌ఓలు సంయుక్తంగా ఈ సర్వేలో పాల్గొంటూ ఫీవర్ బాధితుల వివరాలను సేకరిస్తున్నారు. ఇందులో భాగంగా పారిశుద్ధ్య పరిస్థితులు అధ్వానంగా ఉన్న ఫొటోలను కూడా వారు అప్‌లోడ్ చేస్తున్నారు. దీంతో ఆయా సచివాలయాల అధికార సిబ్బంది, గ్రామ పంచాయతీల సిబ్బంది సమస్య పరిష్కరిస్తున్నారు.

డెంగీ లక్షణాలు..

- డెంగీ జ్వరం ఈడిస్ ఈజిప్టి దోమ కుట్టడంతో వస్తుంది.
- ఈ దోమ కుట్టిన 24 గంటల్లోనే విపరీతమైన తల నొప్పి వస్తుంది.
- జ్వర తీవ్రత పెరిగే కొద్దీ కళ్లు ఎర్రగా మారుతుంటాయి.
- మరుసటి రోజే కండరాల నొప్పి తీవ్రమవుతుంది.
- కీళ్ల నొప్పులు అంటే ప్రతి కీలు వద్ద నొప్పి తీవ్రంగా ఉంటుంది.
- ఒళ్లంతా దద్దుర్లులా మొదలై, అవి ఎర్రగా మారుతుంటాయి.
- ఆహారం తీసుకోవాలనిపించదు.. తీసుకున్నా వాంతులు అవుతాయి.
- రక్త పరీక్షల్లో డెంగీ హెమరోజిక్ ఫీవర్ (డీహెచ్ఎఫ్) అంటే ఎక్కువ తీవ్రత అన్నట్లు.
- ఇక చివరి దశ అంటే డెంగీ షాక్ సిండ్రోమ్ (డీఎస్ఎస్) అంటారు.




నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

నీటి నిల్వలతోనే ప్రమాదం



డెంగీ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే ఫీవర్ సర్వే పై రోజూ టెలీ కాన్ఫరెన్స్ ద్వా రా సూచనలు ఇస్తున్నాం. ఇక గ్రామాల్లో, వార్డుల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇవే డెంగీ జ్వరాలకు ప్రధాన కారణాలు. జిల్లాలో అన్ని గ్రామాల్లోనూ వలంటీర్లు, ఆశ వర్కర్లు ద్వారా ఈ జ్వరాలపై అవగాహన కల్పిస్తున్నాం. పారిశుద్ధ్యంపై కూడా సూచనలు చేశాం. ప్రధానంగా ప్రతి ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో జ్వరాలతో చేరిన రోగుల వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. లేదంటే చర్యలు తప్పవు.

– డాక్టర్ బి.మీనాక్షి, డీఎంహెచ్ఓ



అధికారిక లెక్కలివే..	
పరీక్షించిన రక్త నమూనాలు	1702
డెంగీ పాజిటివ్ కేసులు	18
మలేరియా నమూనాలు	29841
పాజిటివ్ కేసులు	07
2022లో డెంగీ కేసులు	102
2022లో మలేరియా కేసులు	09

‘జగనన్న సురక్ష’కు అపూర్వ స్పందన



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు కృష్ణదాస్, ఎమ్మెల్సీలు దువ్వాడ శ్రీనివాస్, నర్తు రామారావు, ఎమ్మెల్యే రెడ్డి శాంతి, పార్టీ నాయకులు సాయిరాజ్ తదితరులు

- మంత్రి సీదిరి, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ప్రతి గ్రామంలో ఓ పండుగలా జగనన్న సురక్ష కార్యక్రమాలు జరుగుతున్నాయని, రాష్ట్రవ్యాప్తంగా 15వేల సచివాలయాలు ఉంటే ఇప్పటికే 10వేల సచివాలయాల్లో ఈ కార్యక్రమాన్ని పూర్తిచేశామని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. రాష్ట్రంలో 1.17లక్షల కుటుంబాలుంటే ఇప్పటికే 50శాతం మంది కుటుంబాలకు ధ్రువీకరణ పత్రాలు అందించామన్నారు. సచివాలయ వ్యవస్థ వల్లనే ఇది సాధ్యమైందని అన్నారు. శ్రీకాకుళం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అప్పలరాజు మాట్లాడుతూ కార్యక్రమానికి అపూర్వ స్పందన వస్తోందన్నారు. అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్‌నాయుడులు జిల్లాకు ఏం ఒరగబెట్టారో చెప్పాలన్నారు.

మాజీ డిప్యూటీ సీఎం, జిల్లా పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘జగనన్న సురక్ష’ కార్యక్రమం అపూర్వ రీతిలో ప్రజలకు ప్రభుత్వ సర్వీసులను అందించి సరికొత్త రికార్డు సృష్టించిందన్నారు. గత ప్రభుత్వాలు ఇలాంటి రికార్డులు కాదు కదా.. కనీసం ఆలోచించిన దాఖలాలు లేవన్నారు. జగనన్న సురక్ష తరహా కార్యక్రమాలను ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని భావిస్తున్నాయని తెలిపారు. మొట్ట మొదటి జగనన్న సురక్ష శిబిరం జూలై 1 వ తేదీన ప్రారంభం కాగా నేటికి విజయవంతంగా రెండు వారాలు పూర్తి చేసుకుందన్నారు. ఈ నెల 18న ఒకే రోజులో 6,87,863 సర్టిఫికెట్లు జారీ చేసి రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త రికార్డు సృష్టించిందన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీలు నర్తు రామారావు, దువ్వాడ శ్రీనివాస్, ఎమ్మెల్యే రెడ్డి శాంతి, ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్, కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి, డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, సుడా చైర్మన్ కోరాడ ఆశాలత గుప్తా తదితరులు పాల్గొన్నారు.

‘చంద్రబాబు స్క్రిప్ట్ ఫాలో అవ్వకు’

టీడీపీ హయాంలో రాష్ట్రాన్ని అవినీతిలో కూరుకుపోయేలా చేశారని, జన్మభూమి కమిటీలు, కార్యకర్తలు రాష్ట్రాన్ని దోచుకుతిన్నారని పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు ధ్వజమెత్తారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పాలనను చూసి ఓర్వలేని తనంతో అచ్చెన్నాయుడు పిచ్చిప్రేలాపనలు పేలుతున్నారని అన్నారు. అద్భుతమైన అమ్మ ఒడి పథకంపై అచ్చెన్న మాట్లాడిన తీరు అమానుషమని, టీడీపీ హయాంలో ఎందుకు ఈ పథకాన్ని అమలు చేయలేకపోయారని ప్రశ్నించారు. అచ్చెన్నాయుడు సొంత గ్రామంలో స్కూళ్లను సైతం నాడు-నేడు పథకం కింద బాగుచేశామని, కంటికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. బస్సుయాత్ర కోసం విదేశాల్లో డబ్బులు దండుకుని ఊరురా తిరుగుతున్నా స్పందన కరువైందన్నారు. పవన్ కల్యాణ్‌కు సచివాలయ వ్యవస్థ మీద, వలంటీర్ల మీద ఇసుమంత కూడా అవగాహన లేదని, చంద్రబాబు నాయుడు ఇచ్చిన స్క్రిప్ట్ ఫాలో అవుతున్నారని, దీని వల్ల పవన్‌కే నష్టమని చెప్పారు. వైఎస్సార్ పేరు చెబితే ఆరోగ్యశ్రీ, 104, 108, సీఎం జగన్ మోహన్‌రెడ్డి పేరు చెబితే అమ్మఒడి, సచివాలయ వ్యవస్థ గుర్తొస్తాయని చంద్రబాబునాయుడు పేరు చెబితే అవినీతి గుర్తుకొస్తుందన్నారు.





వీడిపోని పోగుబంధం


- నేడు ఐదోవిడత నేతన్న నేస్తం
- ఈ ఏడాది 1460 మందికి రూ 3.50 కోట్ల లబ్ధి



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నేతన్నతో సర్కారు నేస్తరికం అందంగా కొనసాగుతోంది. వైఎస్ జగన్ పాదయాత్ర నాడు అల్లుకున్న ఈ ‘పోగు’ బంధం నాలుగేళ్లుగా పటిష్ఠంగా సాగుతోంది. ఇంటిల్లిపాదీ అహర్నిశలు శ్రమించి పొందికైన దుస్తులు తయారు చేసే చేనేత కళాకారుల కష్టాన్ని పాదయాత్రలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కళ్లారా చూశారు. అధికారంలోకి వచ్చాక మీకు సాయం చేస్తానని మాటిచ్చారు. ఆ మాట ప్రకారమే నేతన్న నేస్తం పథకానికి ఊపిరి పోసి తొలి ఏట నుంచే రూ.24వేలు అందిస్తున్నారు. దీనిలో భాగంగానే ఈ ఏడాది ఐదో విడత కింద శుక్రవారం నేతన్నల ఖాతాల్లో సొమ్ము జమ చేయనున్నారు. జిల్లాలో పొందూరు, లావేరు, ఎచ్చెర్ల, శ్రీకాకుళం అర్బన్, రూరల్, ఆమదాలవలస అర్బన్, పాతపట్నం మండలాల్లో అధిక సంఖ్యలో నేతన్నలున్నారు. జిల్లాలో 33 చేనేత సహకార సొసైటీలు నేత కార్మికులకు అండదండలు అందిస్తున్నాయి. 3600 కుటుంబాలు మగ్గాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి.

ఐదేళ్లలో ఏడు వేల మందికిపైగా రూ.18.34కోట్లు కోట్లు సాయంగా అందించారు. 50 ఏళ్లు నిండిన చేనేత కార్మికులు జిల్లాలో రెండువేల మందికి పైగా ఉన్నారు. ప్రభుత్వం నెలనెలా వృద్ధాప్య పెన్షన్ పథకం కింద రూ.2,500 చొప్పున పంపిణీ చేస్తోంది. జిల్లాలు విడిపోవడం వల్ల లబ్ధిదారులు తగ్గిపోయినట్లు గణాంకాలు చెబుతున్నాయి. అర్హత ఉండే ప్రతి ఒక్క నేతన్నకు ఈ సాయం ప్రభుత్వం అందిస్తోంది.

అర్హులందరినీ గుర్తించాం



గత ఏడాది కంటే ఈ ఏడాది అర్హులను అధిక సంఖ్యలో గుర్తించాం. ప్రభుత్వం నేతన్నల కష్టానికి తగిన చేయూతనిస్తుంది. వరుసగా ఐదో ఏట నేతన్న నేస్తం అందిస్తున్నాం. చేనేత పరిశ్రమను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నాం.

– ఐ.ధర్మారావు, జిల్లా చేనేత, జౌళి అధికారి



మగ్గంపై ఖాదీ వస్త్రాలను తయారుచేస్తున్న నేతన్నలు

ప్రభుత్వ ప్రోత్సాహం ఇలా....

సంవత్సరం	లబ్ధిదారులు	లబ్ధి (రూ.కోట్లలో)
2019-2020	1457	రూ 3.50కోట్లు
2020-2021	1775	రూ.4.26కోట్లు
2021-2022	1601	రూ.3.85కోట్లు
2022-2023	1346	రూ.3.23కోట్లు
2023-2024	1460	రూ.3.50కోట్లు
మొత్తం	7639	రూ. 18.34కోట్లు

‘ఓటర్ల జాబితా తయారీకి సహకరించాలి’

శ్రీకాకుళం పాతబస్టాండ్: కచ్చితమైన వివరాలతో కూడిన ఓటర్ల జాబితా తయారు చేసేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ కోరారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా, కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా ఈ నెల 21 నుంచి ఇంటింటి సర్వే ప్రారంభమవుతుందని చెప్పారు. నెలరోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటికీ వెళ్లి, ఓటర్ల వివరాలను తనిఖీ చేస్తారని చెప్పారు. కొత్త ఓటర్ల నమోదు, లేని ఓటర్ల పేర్లు తొలగించడంతోపాటు, అడ్రస్, డోర్ నంబరు తదితర వివరాలను కూడా ఓటర్ల జాబితాల్లో సరిచేస్తారని చెప్పారు. ఈ ప్రక్రియ కచ్చితంగా, సంపూర్ణంగా తయారు చేసేందుకు పార్టీల సహకారం కూడా అవసరమని పేర్కొన్నారు. దీని కోసం రాజకీయ పార్టీలు తమ బూత్ ఏజెంట్ల జాబితాలను ముందే తమకు అందజేయాలని కోరారు. బీఎల్‌ఓతోపాటు, పార్టీల ఏజెంట్లు కూడా ఇంటింటికీ వెళ్లి వివరాలను సేకరించడం ద్వారా సమగ్ర జాబితాలు తయారవుతాయని అన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు కల్పించేందుకు కృషి చేస్తామని అన్నారు. దీనిలో భాగంగా కళాశాలల్లో కొత్త ఓటర్ల నమోదుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని తెలిపారు. వలస కార్మికులు, ట్రాన్స్‌జెండర్లు, ఇళ్లు లేని, స్థిర నివాసం లేని వారి వివరాలను కూడా సేకరించి ఓటు హక్కు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. డూప్లికేట్ ఓట్లను తొలగించేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని, వారు ఎక్కడ నివాసం ఉంటే అక్కడే ఓటుహక్కు కల్పించి, రెండోదాన్ని తొలగిస్తామని కలెక్టర్ చెప్పారు. సమావేశంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి ఆర్.శ్రీనివాసరావు, బీజేపీ ప్రతినిధి బి.ఉమామహేశ్వరరావు, బీఎస్పీ ప్రతినిధి బొకరా నారాయణరావు, టీడీపీ ప్రతినిధి పి.ఎం జె.బాబు, కాంగ్రెస్ ప్రతినిధి మల్లిబాబు పాల్గొన్నారు.




రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

‘కిడ్నీ వ్యాధుల నియంత్రణకు కృషి’

శ్రీకాకుళం పాతబస్టాండ్: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంతాన్ని పట్టిపీడిస్తున్న కిడ్నీ రోగాన్ని అరికట్టేందుకు శ్రీకాకుళం జిల్లా న్యాయ సేవా సాధికార సంస్థ నడుం కట్టిందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. ఈ నెల 22న శనివారం శ్రీకాకుళం జిల్లా ఎంఎస్‌పల్లి, మాణిక్యంపురం పీహెచ్‌సీల్లో ప్రత్యేక కిడ్నీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తామని జునైద్ అహ్మద్ మౌలానా పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లా న్యాయస్థానంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్దానం ప్రాంతాన్ని గత కొన్నేళ్లుగా పట్టిపీడిస్తున్న మూత్రపిండాల వ్యాధి నివారణకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో ఈ వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. గడిచిన ఆరు నెలలుగా ఉద్దానం ప్రాంతంలో 9 వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. ఉద్దానం ఏరియాలో ఉన్న ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.



ఆదిత్యాలయంలో ఇంటి దొంగలు!


అరసవల్లి సూర్యదేవాలయం

- ఉన్నతాధికారుల ఆదేశాల గోప్యతను బయటపెడుతున్న వైనం
- గతంలో ఏసీబీకి చిక్కిన ఓ ఉద్యోగికి కీలక విభాగాలు
- కఠిన చర్యలకు వెనుకాడుతున్న ఈవో
- ఆలయ అభివృద్ధి పనులను అడ్డుకునేందుకు ఫేక్ ఫిర్యాదులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి క్షేత్ర ప్రతిష్టను భంగపరిచేలా కొందరు ఇంటిదొంగల వ్యవహారం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. ఆలయానికి చెందిన పలు కీలక ఆస్తులు, ఆదాయాల ఫైళ్లు, పరిపాలన వ్యవహారాలపై ఉన్నతాధికారుల నుంచి వస్తున్న నివేదికలు, విచారణాదేశాలపై గోప్యతను పాటించాల్సిన కీలక సిబ్బంది..'కంచే చేను మేసేలా..' వ్యవహారాలు వెలగబెట్టడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఆలయానికి చెందిన కీలక సమాచారాన్ని, గోప్యతాంశాలను కొందరు తమ వాట్సాప్‌ల ద్వారా, జిరాక్స్ కాపీల ద్వారా 'బయటకు' పంపిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆలయంలో కీలక పత్రాలను, రిజిస్టర్లను, ఓచర్లను సైతం బయటవారికి (పచ్చ పత్రికలకు) ఉద్దేశపూర్వకంగానే అందజేస్తున్న వ్యవహారాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. దీంతో ఆలయ ప్రతిష్టకు భంగం వాటిల్లుతుందనే అభిప్రాయాలు స్థానిక భక్తుల నుంచి వ్యక్తమవుతున్నాయి. ఇంత జరుగుతున్నా ఆలయ పరిపాలన విభాగంలో సదరు వ్యక్తులు, సిబ్బంది వ్యవహారాలపై ఆలయ ఈవో హరిసూర్యప్రకాష్ ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. భక్తులకు మంచి దర్శనం, సౌకర్యాల కల్పనపై దృష్టి పెట్టిన ఈవో.. పరిపాలన వ్యవహారాలపై కొరడా ఝులిపించకపోవడంపై పలు విమర్శలకు తావిస్తోంది.

అతనికి కీలక బాధ్యతలా...!

అరసవల్లి ఆలయంలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి గతంలో విశాఖ జిల్లాలో ఓ దేవాలయంలో పనిచేస్తూ ఏసీబీకి చిక్కాడు. అప్పట్లో ఈయన వ్యవహారం సంచలనమే అని చెప్పాలి. అలాంటి ఉద్యోగికి ఏకంగా 6ఏ క్యాడర్‌లోని ప్రఖ్యాత సూర్యదేవాలయంలో నియమించడంతో పాటు కీలక బాధ్యతలు అప్పగించడం తీవ్ర చర్చనీయాంశమైంది. తాజాగా గురువారం విశాఖపట్నంలో జరిగిన ఉన్నతాధికారుల సమావేశంలో కూడా ఇదే అంశంపై ఈవో వి.హరిసూర్యప్రకాష్ వద్ద ప్రస్తావించినట్లు తెలిసింది. కీలక బాధ్యతలు ఎలా ఇచ్చారంటూ ప్రశ్నించినట్లుగా సమాచారం. ఈయన వ్యవహారం ఇప్పుడు అరసవల్లిలో హాట్ టాపిక్‌గా మారింది. దినసరి వేతనాల పద్ధతిలో విధులు నిర్వర్తిస్తున్న కొందరు యువతీ యువకులకు 'శాశ్వత ఉద్యోగులుగా' చేస్తానంటూ పాత ధోరణిని ప్రదర్శించడం మొదలుపెట్టారని వార్తలొస్తున్నాయి. ఆలయంలో ముగ్గురు జూనియర్ అసిస్టెంట్లు విధుల్లో ఉన్నప్పటికీ వారికెవ్వరికీ పెద్దగా ప్రాధాన్యత విభాగాలను అప్పగించకుండా బదిలీపై వచ్చిన ఈయనకే కీలక బాధ్యతలు అప్పగించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

ఫేక్ లేఖలు..

గత ప్రభుత్వం హయాంలో అరసవల్లిలో ఏ ఒక్క అభివృద్ధి జరగని సంగతి విదితమే. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక స్థానిక మంత్రి ధర్మాన ప్రసాదరావు చొరవతో ప్రస్తుత ప్రభుత్వం హయాంలోనే రెండోసారి కూడా పాలకమండలిని నియమించడంతో పాటు వారి ప్రోత్సాహంతో భక్తుల నుంచి పెద్ద ఎత్తున విరాళాలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఆలయ రూపురేఖలు మారిపోయేలా అటు మూలవిరాట్టుకు మకరతోరణాలతో పాటు ఇటు భక్తుల వినియోగానికై అద్భుత సౌకర్యాలు కలిగిస్తున్నారు. లక్షలాది రూపాయలతో పనులను చేపడుతుంటే.. వీటిని చూసి తట్టుకోలేని కొందరు ఎలాగైనా ఈ అభివృద్ధి పనులను అడ్డుకునేలా ప్రయత్నాలు చేస్తున్నారు. పనుల్లో అవినీతి జరుగుతోందంటూ రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్‌కు ఆకాశరామన్న లేఖల ద్వారా ఫిర్యాదులు చేస్తున్నారు. కేవలం వ్యక్తిగత కక్షలతోనే ఇలాంటి పేరు, ఊరు లేకుండానే ఫిర్యాదు లేఖలు పంపించినట్లు ఆలయ అధికారులు గుర్తించారు. ఏదిఏమైనా అరసవల్లి ఆలయంలో తప్పుడు వ్యవహారాలపై ఈవో ప్రత్యేక దృష్టి సారించి కఠిన చర్యలు చేపడితేనే ఆలయ పాలన గాడిలోకి పడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కీలక పత్రాలు బయటకు రావడంపై విచారణ..



దేవదాయశాఖ కమిషనర్‌కు ఎవరో పంపిన ఫిర్యాదుపై విచారించి ఉన్నతాధికారులకు కాన్ఫిడెన్షియల్‌గానే నివేదిక పంపిస్తామనుకున్నాం. అయితే ఫిర్యాదు కాపీ బయటకు వెళ్లడంపై సీరియస్‌గా పరిగణిస్తున్నాం. దీనిపై విచారించి తగు చర్యలు చేపడతాం. ఆలయంలో ఖర్చు, వినియోగాలపై ప్రతి పైసాకు..స్టేట్ ఆడిట్ శాఖ ప్రీఆడిట్ నిర్వహిస్తోంది. దీంతో దాదాపుగా ఆర్థిక అంశాలు, వినియోగాలన్నీ పారదర్శకంగానే జరుగుతున్నాయి.

– వి.హరిసూర్యప్రకాష్, ఆలయ ఈవో

ఉపాధి పనులతో మేలు కలగాలి

- సిబ్బంది అవినీతికి దూరంగా ఉండాలి
- ఎంజీఎన్ఆర్ఈజీఎస్ డైరెక్టర్ చిన్నతాతయ్యలు


సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్ చిన్నతాతయ్యలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉపాధి పనులు చేసేటప్పుడు వేతదారులకు మేలు కలగాలని, ఆ ప్రాంతం అభివృద్ధి చెందాలని మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం డైరెక్టర్, విజిలెన్స్ అధికారి పి.చిన్నతాతయ్యలు అన్నారు. జిల్లాలో ఉపాధి పనుల తీరుపై గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆ శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది అవినీతికి దూరంగా ఉండాలన్నారు. రైతులకు మేలు జరిగేలా పనులు చేయించాలని సూచించారు. జిల్లాలో పనులు చురుగ్గా జరుగుతున్నాయని, మెటీరియల్ కాంపొనెంట్ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. నిధులు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. సమావేశంలో జాయింట్ కమిషనర్ జ్యోతి, డిప్యూటీ కమిషనర్ మల్లికార్జునరావు, డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు, ఏపీఓలు, ఏపీడీలు, టెక్నికల్ సిబ్బంది, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

పనిదినాల కల్పనలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానం..

రాష్ట్రంలో ఈ ఏడాది 24 కోట్ల పనిదినాల లక్ష్యానికి గాను ఇంతవరకు 18 కోట్ల పనిదినాల కల్పించామని డైరెక్టర్ తెలిపారు. దేశంలో ఇదొక అరుదైన రికార్డు అని చెప్పారు. డీబీటీ విధానం ద్వారాకూలీలకు వేతనాలు చెల్లిస్తుండటంతో ఎటువంటి అవినీతి ఆరోపణలకు ఆస్కారం లేకుండా పోయిందన్నారు. ఈ ఏడాది 45 లక్షల కుటుంబాలకు ఆరు వేల కోట్ల రూపాయలు చెల్లించామన్నారు. 60 వేల ఎకరాల్లో ఉద్యానవనాల పెంపకానికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. మౌలిక వసతుల కల్పనకు రూ.3500 కోట్ల నుంచి రూ. 4వేల కోట్ల వ్యయం చేస్తున్నామని వివరించారు. చిన్న, సన్నకారు రైతులు మునగపంట సాగు చేస్తే అధిక ఆదాయం పొందవచ్చన్నారు.

22న కిడ్నీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు

అరసవల్లి: కంచిలి మండలం మఠం సరియాపల్లి, మాణిక్యపురం పీహెచ్‌సీల్లో ఈ నెల 22న ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కిడ్నీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.మీనాక్షి తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా సమక్షంలో ఈ ప్రత్యేక వైద్య పరీక్షల శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. స్థానికులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రక్త పరీక్షలు, సీరం క్రియాటిన్ లెవల్ పరీక్షలతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని వివరించారు.

2030 తరువాత బీఎడ్ కోర్సు ఉండదు

ఎచ్చెర్ల క్యాంపస్: నూతన విద్యా విధానం అమలు నేపథ్యంలో 2030 తరువాత బీఎడ్ కోర్సు ఉండదని, నిపుణులైన ఉపాధ్యాయులను తయారు చేసే నాలుగేళ్ల సమీకృత ఉపాధ్యాయ విద్యా కోర్సు మాత్రమే ఉంటుందని అంబేడ్కర్ వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు చెప్పారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది నుంచి విశ్వవిద్యాలయంలో బీఎస్సీబీఎడ్ (ఎంపీసీ), బీఏబీఎడ్ (హెచ్ఈపీ) సబ్జెక్టులతో కోర్సులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. 100 సీట్లు అందుబాటులో ఉంటాయని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పరీక్ష నిర్వహణ తరువాత ఉన్నత విద్యా మండలి కౌన్సెలింగ్ నిర్వహిస్తుందని వివరించారు. ఇంటర్మీడియట్ పూర్తిచేసిన విద్యార్థులు అర్హత బట్టి ఈ నెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మూడేళ్ల తర్వాత డిగ్రీతో రిలీవ్ కావచ్చునని, నాలుగేళ్ల తరువాత డిగ్రీతో కలిపి బీఎడ్ అర్హత ధ్రువీకరణ పత్రం అందజేయనున్నట్లు చెప్పారు. ప్రయోగ విద్య, క్షేత్రస్థాయి విద్యకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ సంస్థ కోర్సు నిర్వహణకు అనుమతి ఇచ్చిందన్నారు.

తైక్వాండో పోటీల్లో సిక్కోలు కుర్రాడి ప్రతిభ


గోల్డ్‌మెడల్ సాధించిన గురుగుబెల్లి సుబ్బారావు

ఆమదాలవలస రూరల్ : బ్యాంకాక్ థాయిలాండ్‌లో ఈ నెల 15 నుంచి జరిగిన అంతర్జాతీయ తైక్వాండో పోటీల్లో సిక్కోలు కుర్రాడు ప్రతిభ కనబరిచాడు. ఆమదాలవలస మండలం అక్కులపేటకు చెందిన గురుగుబెల్లి సుబ్బారావు 80 కిలోల కేటగిరీ కయోరుగీ విభాగంలో బంగారు పతకం సాధించాడు. మొత్తం 8 దేశాల నుంచి క్రీడాకారులు హాజరైన ఈ పోటీల్లో 31-40 ఏళ్ల వ్యక్తిగత విభాగంలో పతకం సాధించి సత్తాచాటాడు. పూమ్‌సేయ్ విభాగంలోనూ సిల్వర్ మెడల్ దక్కించుకున్నాడు. ఈయన తల్లిదండ్రులు వెంకటరమణ, కృష్ణవేణి వ్యవసాయ కూలీలు. సుబ్బారావుకు క్రీడలపై ఆసక్తి ఉన్నందున హైదరాబాద్‌లోని సోమా పిట్ వరల్డ్ తైక్వాండో అకాడమీలో శిక్షణ ఇప్పించారు.ఇంజనీరింగ్ చదువుతూనే పోటీల్లో పాల్గొంటూ గతంలో బ్యాంకాక్‌లో జరిగిన పోటీల్లో కాంస్య పతకం, కొరియాలో రజత పతకం సాధించాడు. ఒలింపిక్స్‌లో పతకం సాధించాలని ఆశిస్తున్నట్లు తల్లిదండ్రులు ఆకాంక్షిస్తున్నారు.

తైవాన్ జామ సాగు పరిశీలన

గార: మండలంలోని శ్రీకూర్మం పంచాయతీ తండ్యాలపేటలో తైవాన్ జామకాయల సాగును విజయవాడకు చెందిన పీఆర్ అండ్ ఆర్డీ జాయింట్ కమిషనర్ జ్యోతి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు సాయం అందించడంలో భాగంగా ఇప్పటికే పామాయిల్ తోటల పెంపకానికి ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డ్వామా పీడీ చిట్టి రాజు, ఏపీడీ శైలజ, ఏపీఎం సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లపై ఆరోపణలు సరికాదు

- మంత్రి ధర్మాన ప్రసాదరావు


ధ్రువపత్రాలను అందజేస్తున్న రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు

గార: వలంటీర్లపై నిరాధారణ ఆరోపణలు చేయడం తగదని, వలంటీర్ల కృషి వల్లే సంక్షేమ పథకాల అమలు పారదర్శకంగా జరుగుతోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. బుధవారం గార మండలం సతివాడ, కొర్లాం సచివాలయాల పరిధిలో ఎంపీపీ గొండు రఘురామ్ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. సురక్ష కార్యక్రమంలో భాగంగా 20 రోజుల్లో రాష్ట్రంలో 25 లక్షల మేర ధ్రువపత్రాలను ఉచితంగా అందజేశామని వివరించారు. అసైన్డ భూములు 20 ఏళ్లు సాగుబడిలో ఉంటే అమ్ముకునే అవకాశం కల్పించామని, ఈ నిర్ణయంతో 15 లక్షల మంది రైతులకు మేలు జరుగుతుందన్నారు.

రాష్ట్రంలో 8 షిప్పింగ్ హార్బర్లు నెలకొల్పేందుకు ప్రణాళికలు వేసినట్లు తెలిపారు. డ్వాక్రా సంఘ సభ్యులకు రుణమాఫీ చేస్తానని చంద్రబాబు మాట ఇచ్చి తప్పుకున్నాడని, ఇచ్చిన మాటకు కట్టుబడిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి మూడు విడతలుగా రుణమాఫీ నిధులు జమచేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పీస శ్రీహరి రావు, యాళ్ల నారాయణమూర్తి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, బొడ్డేపల్లి పద్మజ, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్, ముంజేటి కృష్ణమూర్తి, పీస గోపి, కొయ్యాన నాగభూషణం, సుగ్గు మధురెడ్డి, ఎంపీటీసీ పాదిలాపు శ్రీరాములు, పలువురు సర్పంచ్‌లు,ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి సెంటు భూమికి సాగునీరు


తోటపల్లి ఎడమ కాలువ రెగ్యులర్ వద్ద నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే జోగులు,ఎమ్మెల్సీ విక్రాంత్ తదితరులు


నారాయణపురం ఆనకట్ట నుంచి నీరు విడుదల చేస్తున్న అధికారులు

వీరఘట్టం/గరుగుబిల్లి: తోటపల్లి ఆయకట్టు పరిధిలోని ప్రతీ సెంటు భూమికి సాగునీరందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. తోటపల్లి ప్రాజెక్టు వద్ద పాత ఆయకట్టు కుడి, ఎడమ కాలువలకు గురువారం సాగునీటిని విడుదల చేశారు. తోటపల్లి ప్రాజెక్టు వద్ద 414 క్యూసెక్కుల సామర్థ్యం ఉన్న ఎడమ కాలువ రెగ్యులేటర్ నుంచి 150 క్యూసెక్కుల నీటిని, 106 క్యూసెక్కుల సామర్థ్యం ఉన్న పాత కుడి కాలువకు 60 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

సాగునీరు విడుదల

బూర్జ: మండలంలో గల నారాయణపురం ఆనకట్ట వద్ద ఎస్ఈ పి.సుధాకరరావు ఆధ్వర్యంలో గురువారం నాగావళి నది నుంచి కుడి,ఎడమ కాలువలకు సాగునీరు విడుదల చేశారు. ఎడమ కాలువ ద్వారా శ్రీకూర్మం గ్రామం వరకు, కుడి కాలువ ద్వారా విడుదల చేసిన సాగునీరు ఎచ్చెర్ల మండలం పొన్నాడ గ్రామం వరకు వెళ్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డీఈ మురళీమోహనరావు, ఏఈలు ఎస్. శ్రీనివాసరావు, కె.రాంబాబు, పి.రవికుమార్, జీవీ రమణ పాల్గొన్నారు.

అగ్నివీర్ ర్యాలీ ప్రారంభం

- పోలీస్ శిక్షణ కళాశాల మైదానంలో సాగిన దేహదారుఢ్య పరీక్షలు
- పర్యవేక్షించిన ఆర్మీ ఉన్నతాధికారులు, ఎస్పీ దీపిక


అగ్నిపథ్ ర్యాలీ ఏర్పాట్లను పరిశీలిస్తున్న విజయనగరంఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: జిల్లా కేంద్రంలోని పోలీస్ శిక్షణ కళాశాల మైదానంలో అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ గురువారం ప్రారంభమైంది. అర్ధరాత్రి నుంచే అభ్యర్థులు మైదానానికి చేరుకున్నారు. శ్రీకాకుళం జిల్లా నుంచి ఎన్టీఆర్ జిల్లా వరకూ వివిధ ప్రాంతాల నుంచి సుమారు వెయ్యిమంది యువకులు విజయనగరం రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్ నుంచి పీటీసీకి చేరుకుని దేహదారుఢ్య పరీక్షల్లో పాల్గొన్నారు. ఆగస్టు రెండో తేదీ వరకూ ర్యాలీ కొనసాగనుంది. ముందుగా అడ్మిట్ కార్డులు పరిశీలించి, ఎత్తు కొలిచిన అనంతరం 1.6 కిలోమీటర్లు పరుగు పందెం నిర్వహించారు. తర్వాత పులప్స్, జిగ్జాగ్ వాకింగ్, డిచ్ జంపింగ్ తదితర శారీరక దారుఢ్య పరీక్షలు నిర్వహించారు. వీటిలో అర్హత సాధించిన సుమారు 300 మందిని తదుపరి పరీక్షలకు ఎంపిక చేశారు. వీరికి అల్పాహారం, భోజనాలను జిల్లా యంత్రాంగం సమకూర్చింది. ర్యాలీ ఏర్పాట్లను ఎస్పీ ఎం.దీపిక పర్యవేక్షించారు. ఆర్మీ అధికారి జి.ఎస్.రంధవ నియామక ప్రక్రియను ఎస్పీకి వివరించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి, సీఐలు పాల్గొన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,750-00
బంగారం(22సి. 10గ్రా.)	55,700-00
వెండి (కిలో)	82,400-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹112	₹194	₹ 204